ప్రజాశక్తి
శనివారం 28 జూన్ 2025
5
కర్నూలు

పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య

• నగరంలో పెరిగిన వాహనాల రద్దీ • క్రమబద్ధీకరణలో నత్తనడకన అధికారులు • ఇబ్బందుల్లో ప్రజలు, వాహనదారులు

నగరంలో పెరిగిన వాహనాల సంఖ్య కారణంగా ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రంగా ముదురుతోంది. సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చేపడుతున్న చర్యలు నామమాత్రంగానే ఉండటంతో సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారవుతుంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందుల కు గురవుతున్నారు.

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగరం రోజురోజుకు పెద్ద ఎత్తున విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజల సంఖ్యతో పాటు వాహనాలను వినియోగించే వారి సంఖ్య కూడా పెద్ద ఎత్తున పెరిగింది. గత ఐదేళ్లలో వాహనాల వినియోగం నగరంలో 200 శాతానికి పైగానే పెరిగిందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దీనికి అనుగుణంగా రోడ్ల విస్తరణ ట్రాఫిక్ నియంత్రణ చర్యలు పెద్ద ఎత్తున చేపట్టాల్సి ఉంది. అధికారులు మాత్రం సమస్యను పూర్తిస్థాయిలో నియంత్రించడంలో విఫలమవుతున్నారని విమర్శ వినిపిస్తోంది. నామమాత్రపు చర్యలను చేపట్టడం కారణంగా సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారానికి నోచుకోలేకపోతోంది. నగరంలో ప్రధానంగా రవాణా రంగంపై పెద్ద ఎత్తున ఆధారపడి ఉంది. ముఖ్యంగా చదువుకున్న నిరుద్యోగులు నిరుద్యోగ సమస్య కారణంగా అత్యధికంగా ఆటో డ్రైవర్లగా ఉపాధిని ఎంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో సుమారు 25 వేల ఆటోలకు పైగా నడుపుతున్నట్లు తెలుస్తోంది. ఇవే కాకుండా ఇతర రవాణా వాహనాలు ముఖ్యంగా ప్రతి ఇంటికి కనీసం ఒక బైకు సగటున నిర్వహిస్తున్నట్లు అంచనా. ఈ నేపథ్యంలో నగరంలో వాహనాల సంఖ్య పెరగడం తద్వారా రోడ్లపై వాటి రద్దీ కూడా అదే స్థాయిలో పెరిగింది. తద్వారా నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. కర్నూలు నగరంలో ప్రధానంగా రాజ్ విహార్, బళ్లారి చౌరస్తా, వన్‌టౌన్, మోక్షగుండం విశ్వేశ్వరయ్య సర్కిల్, వైజంక్షన్, కల్లూరు చెన్నమ్మ సర్కిల్ కూడళ్లలో సమస్య తీవ్రంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఉదయం తొమ్మిది గంటల నుంచి పది గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి 7 గంటల వరకు ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రంగా కనిపిస్తోంది. ఉదయం సాయంత్రం వేళల్లో ఆఫీసు కార్యాలయాలకు, విద్య సంస్థలకు వచ్చి వెళ్లే సమయాలలో ఈ సమస్య మరింత తీవ్రంగా కనిపిస్తోంది. ముఖ్యంగా వన్‌టౌన్ లాంటి ఇరుకైన రోడ్ల మధ్యలో ట్రాఫిక్ సమస్య ఏర్పడితే వాహనదారుడు తన పరిస్థితి పద్మవ్యూహంలో చిక్కుకున్న పరిస్థితి అవుతుంది. అక్కడ ట్రాఫిక్ క్లియర్ కావడానికి సుమారు పది నిమిషాల నుంచి అరగంట పైగానే సమయం పడుతుందంటే ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ఇలాంటి సందర్భంలో ఏదైనా అత్యవసర సమయంలో వచ్చే అంబులెన్సు ఈ రూట్లో వస్తే ఎదురయ్యే వ్యవస్థ అంతా ఇంతా కాదని చెప్పవచ్చు. సాధారణంగా ట్రాఫిక్కు సిగ్నల్స్ పడితే కనీసం రెండు నుంచి మూడు నిమిషాల పైనే నిల్చవలసి వస్తోంది. ఒక్కోసారి ఏదైనా ప్రమాదాలు చూస్తూ చేసుకున్నట్లయితే కేవలం ఐదు నిమిషాల పరిధిలోనే కిలోమీటర్ల పొడవునా వాహనాలు నిలిచిపోయి బారులు తీరే పరిస్థితి నెలకొంది. దీంతో వాహనదారులు ఆ చక్ర బంధం నుంచి బయట పడేందుకు విసిగి వేసారుతున్నారు. ఆల్ ఎవరైనా నగరంలో చాలా కూడలలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ అస్తవ్యస్తంగా కొనసాగుతోంది. సిగ్నళ్లు ఎప్పుడు ఏ సమయంలో పనిచేస్తాయో...పనిచేయవో....అర్థం కాని పరిస్థితి కొనసాగుతోంది. దీంతో వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ రధిని తగ్గించేందుకుగాను రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఆధునికరించాలని పలువురు కోరుతున్నారు.

జరిమానాలు వేసే శ్రద్ధ ట్రాఫిక్ నియంత్రణపై లేదా..?

- వై.నగేష్, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రజలపై జరిమానా భారాలు మోపే శ్రద్ధ ప్రభుత్వం ట్రాఫిక్ సమస్య పరిష్కారాలపై ఉంచడటం లేదు. ట్రాఫిక్ రద్దీ నియంత్రణలో అధికారులు చిత్తశుద్ధి కొరబడుతోంది. తూతూ మంత్రంగానే చర్యలు చేపడుతున్నారు. రద్దీ నియంత్రించేందుకు తగిన విధంగా రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలి.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

- రాణా ప్రతాప్, వాహనదారుడు, కర్నూలు.

నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా పెరుగుతోంది. దాన్ని వెంటనే పరిష్కరించాలి. ఏదైనా చిన్న ఆటంకం ఏర్పడినా ట్రాఫిక్‌లో ఇరుక్కు పోవాల్సి వస్తోంది. అర్ధగంటకు పైగా నిలబడి పోవాల్సి వస్తుంది. ట్రాఫిక్ నియంత్రణ చర్యలు పూర్తిస్థాయిలో చేపట్టాలి.

చిరుత హల్‌చల్

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని తిప్పాలదొడ్డి గ్రామంలో చిరుత పులి హల్‌చల్ చేసింది. శుక్రవారం గ్రామ సమీపంలో చిరుత పులి ప్రజల కంటపడడంతో పరుగులు తీశారు. చిరుత పులి టెంకాయ చెట్టు ఎక్కి.. మళ్లీ కనిపించడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సమీవుల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆత్మకూరు ఫారెస్ట్ రిస్క్ టీం గ్రామానికి చేరుకుని తమ పద్ధతిలో ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. ఒక బోన్‌లో మేక పిల్లను ఉంచి చిరుత పులిని పట్టుకొనే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. మరో కోణంలో మత్తు ఇంజెక్షన్ ద్వారా పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. చీకటి పడడంతో ప్రయత్నాలు విరమించుకున్నట్లు తెలిసింది. రిస్క్ టీం వివిధ కోణాల్లో ప్రయత్నించినా చిరుత పులి దొరకకుండా అడవిలో దాక్కుంది.

టెంకాయ చెట్టు ఎక్కిన చిరుత

పారదర్శకంగా బదిలీలు...

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయ ఉద్యోగుల బదిలీల అంశంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 28, 29వ తేదీలలో సచివాలయ ఉద్యోగులకి కౌన్సిలింగ్ నిర్వహించి, 30వ తేది నాటికి ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఐదేళ్ల సర్వీస్‌పూర్తయిన వారికి ఖచ్చితంగా బదిలీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వికలాంగులు, వితంతువులు, స్పౌజ్ కేసులకు సంబంధించి జిఓఎంఎస్ నెం.4,5 ప్రకారం రిక్వెస్ట్ బదిలీలను చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బదిలీల ప్రక్రియలో ప్రభుత్వ ఉత్తర్వులను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం ఆయా శాఖల అధికారులతో మాట్లాడి బదిలీలకు సంబంధించి తీసుకుంటున్న చర్యల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

ఇవిఎం గోడౌన్ కలెక్టర్ తనిఖీ

ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు త్రైమాసిక తనిఖీలో భాగంగా కలెక్టరేట్‌లో ఉన్న ఇవిఎం గోడౌన్‌ను శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల సమక్షంలో గోదాం లోపల భద్రపరిచిన ఇవిఎం యంత్రాలు, అక్కడి భద్రతా చర్యలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి, రాజకీయ పార్టీ ప్రతినిధులు బిజెపి తరపున సాయి ప్రదీప్ , జనసేన పార్టీ తరపున మంజునాథ్, బహుజన సమాజ్ వాదీ పార్టీ డిస్టిక్ ఇంచార్జ్ అరుణ్ కుమార్, తెలుగుదేశం పార్టీ తరపున తెలుగు యువత వైస్ ప్రెసిడెంట్ పి.రాజు, కాంగ్రెస్ పార్టీ తరపున బజారన్న పాల్గొన్నారు.

ఆస్పిరేషనల్ బ్లాక్‌ల అభివృద్ధికి కషి

జిల్లాలలో గుర్తించబడిన ఆస్పిరేషనల్ బ్లాక్‌ల అభివృద్ధికి కృషి చేయాలని నీతి ఆయోగ్ సిఇఒ బివిఆర్ సుబ్రహ్మణ్యం, అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఢిల్లీ నీతి ఆయోగ్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని నీతి ఆయోగ్ సిఇఒ బివిఆర్ సుబ్రహ్మణ్యం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఇఒ మాట్లాడుతూ... దేశంలో గుర్తించిన 329 జిల్లాలలోని 500 ఆస్పిరేషనల్ బ్లాక్‌లను జిల్లా కలెక్టర్లు అభివృద్ధి చేయాలని ఆదేశించారు. వ్యవసాయం , విద్య , నీటి సౌకర్యాలు , స్కిల్ డెవలప్మెంట్ , పోషకాహారం అందించడం , అంగన్వాడీ కేంద్రాలు మొదలగు వాటిని వెంటనే అభివద్ధి చేయాలని ఆదేశించారు. గుర్తించబడిన బ్లాక్ లలో అన్ని మౌలిక సౌకర్యాలు సంతప్తి స్థాయికి వరకు కల్పించే చర్యలు తీసుకోవాలని వాటికి అవసరమైన నిధులు సమకూరుస్తామని తెలియజేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులతో మాట్లాడుతూ... జిల్లాలో ఆస్పిరేషనల్ బ్లాక్‌ల అభివద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ నిధులు వచ్చేలా అభివృద్ధిపై ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. సాధించిన ప్రగతిని ఎప్పటికప్పుడు నీతి ఆయోగ్ వెబ్‌సైట్ అప్లోడ్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సిపిఒ హిమ ప్రభాకర్ రాజు, హౌసింగ్ పిడి చిరంజీవి, డిఆర్‌డి పిడి రమణారెడ్డి , జెడి అగ్రికల్చర్ వరలక్ష్మి, పశుసంవర్ధక శాఖ జెడి శ్రీనివాసులు,ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు,డిఇఒ శామ్యూల్ పాల్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ భాస్కర్, ఐసిడి ఎస్ పిడి నిర్మల, డిడి గ్రౌండ్ వాటర్ శ్రీనివాస రావు, జిల్లా ఆస్పిరేషనల్ బ్లాక్స్ మండల కోఆర్డినేటర్ లు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

నేడు జడ్‌పి సర్వసభ్య సమావేశం

-మంత్రులు,ఎమ్మెల్యేలు హాజరయ్యేరా ? -ఉమ్మడి జిల్లా సమస్యలపై గళమెత్తేరా ?

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం చైర్మన్ పాపిరెడ్డి అధ్యక్షతన శనివారం 11 గంటలకు జడ్‌పి సమావేశ భవనంలో నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ,ఎమ్మెల్సీలు పూర్తి స్థాయిలో హాజరు కాలేని పరిస్థితులు నెలకొన్నాయి. వ్యవసాయ అనుబంధ శాఖలు, విద్య,వైద్యం, ఆరోగ్యం, పారిశుధ్య, అంశాలపై సమావేశం నిర్వహిస్తున్నారు. ఇప్పటిదాకా జరిగిన సర్వసభ్య సమావేశాల్లో వైసిపి పార్టీని నిందించడం తప్ప ప్రజా సమస్యలపై మాట్లాడిన దాఖలాలు లేవు. ఉమ్మడి జిల్లా రైతాంగం సమస్యలు గాలికొదిలారు.

ప్రశ్నిస్తున్న వైసిపి ఎమ్మెల్యే విరుపాక్షి (ఫైల్)

సరైన సమయంలో విత్తనాన్ని, ఎరువులను, అందించడంలో వ్యవసాయ శాఖ పూర్తిగా విఫలం అయింది. కల్తీ విత్తనాలను అరికట్టడంలో కన్నెత్తి చూడని దుస్థితిలో వ్యవసాయ అధికారులు ఉన్నారు. ఆరోగ్యం పారిశుధ్యం పట్టించుకున్నా నాధుడు కరువయ్యారు. యోగ కోసం ,కూటమి ప్రభుత్వం ఏడాది పాలన ఉత్సవాల పై చూపిన శ్రద్ధ రైతులపై చూపలేదని జిల్లా రైతాంగం చర్చిస్తున్నారు. విద్య వైద్యం అధిక ఫీజులతో పేద, మధ్యతరగతి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు నెలకొన్నాయి. పెరిగిన విద్య ఫీజులపై కార్పొరేట్ పాఠశాలల దోపిడీ పై ఒక్క ఎమ్మెల్యే, మంత్రి నోరు విప్పని దుర్మార్గపు పాలనలో ఉండటం జిల్లా ప్రజలకు తీవ్ర కష్టాలను మిగిలుస్తుందని ప్రజలు వాపోతున్నారు. నేడు జరగబోయే సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు అందరూ హాజరయి ప్రజా సమస్యలపై చర్చించి ఉమ్మడి జిల్లాను అభివృద్ధి చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రజలు, రైతులు కోరుతున్నారు.

52వ రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

-అక్కడే వంటావార్పు - సమ్మె విరమించకపోతే తొలగిస్తామని బెదిరింపులు

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న వాటర్ వర్క్స్, స్ట్రీట్ లైట్, పార్కులు డివైడర్లలో పనిచేసే ఉద్యోగులు, గత 52 రోజులుగా నగరపాలక సంస్థ కార్యాలయం ముందు శాంతియుతంగా సమ్మె చేస్తున్నారు. దీంతో నగరంలో నీటి సమస్య, ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక అంధకార అలుముకుంది. పార్కులలో పనిచేసేవారు సమ్మెలో ఉండటం చేత పార్కులన్నీ చెత్త మాయమయ్యాయి. మీరు తమకు కనీస వేతనం అన్న ఇవ్వండి సంక్షేమ పథకాలు అన్న వర్తింపచేయాలని కోరుతూ సమ్మె చేస్తున్నారు. తాము 20, 30 సంవత్సరాలుగా ఉద్యోగాలు చేస్తూ పదవి విరమణ సమయం దగ్గర పడుతున్న కేవలం 13 వేల రూపాయలతో ఎలా జీవనం గడపాలని కలెక్టర్‌కు, కమిషనర్ , మేయర్‌కు, ఎమ్మెల్యేలకు, ఎంపీకి, పరిశ్రమల శాఖ మంత్రికి, కర్నూలు నగరానికి జిల్లా ఇన్చార్జి మంత్రి వచ్చిన సందర్భంగా విన్నవించుకున్నా ఎలాంటి స్పందన లేకపోవడంతో వారు సమ్మెను అలాగే కొనసాగిస్తున్నారు. అక్కడే వంటావార్పు చేస్తూ వంట మనుషులుగా అవతారం ఎత్తారు. అక్కడే సాంబార్ అన్నం తింటూ భిక్షాటన, మోకాళ్లపై నిలిచి, భార్యా పిల్లలతో ర్యాలీలు నిర్వహించి, నిరసనలను తెలిపారు. మరొక నగరంలో తాగునీటి సమస్య ఏర్పడి ఇబ్బంది పడుతున్నారు. అయినా అధికారులు కానీ ప్రజా ప్రతినిధులకు కానీ ఏమాత్రం చీమకుట్టినట్లు కూడా లేకపోవడం శోచనీయం. ఇదంతా ఒక ఎత్తైతే..ఇంజనీరింగ్ అధికారులు తమ ఛాంబర్ కు సొమ్ము చేస్తున్న ఉద్యోగుల నాయకులను పిలిచి మీరు సమ్మెను విరమించకపోతే, మిమ్మల్ని తొలగించి కొత్తవారిని ఆప్కాస్‌లోకి తీసుకుంటామని బెదిరిస్తూ నోటీసులు ఇస్తున్నారు. ఏది ఏమైనా మున్సిపల్ ఇంజనీరింగ్‌లో పని చేసే ఆప్కాస్ ఉద్యోగులు అధికారుల బెదిరింపులకు భయపడకుండా మొక్కవోని దీక్షతో సమ్మెను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం మీరు చేస్తున్న సమ్మెతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దష్టిలో పెట్టుకుని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

వంటావార్పు నిర్వహిస్తున్న కార్మికులు

పోస్టరును విడుదల చేస్తున్న నోడల్ అధికారి రఘు

అతిసార వ్యాధి నుండి పిల్లల్ని కాపాడుదాం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామంలో నిర్వహిస్తున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్.రఘు తనిఖీ చేశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహనా కల్పించారు. అతిసార వ్యాధి నుండి పిల్లల్ని కాపాడుదాం అనే నినాదంతో స్టాప్ డయేరియా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుండి 31 వరకు వైద్య ఆరోగ్య శాఖ అధ్వర్యంలో అతిసార నియంత్రణ పక్షోత్సవాలు జరుగుతాయని తెలిపారు. వేసవిలో కలుషిత నీరు, ఆహారం వలన అతిసారం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని,ప్రధానంగా పిల్లలు అతిసారం బారిన పడుతుంటారని వీధుల్లో విక్రయించే శీతల పానీయాలు తీసుకోవడం, కలుషితమైన ఆహారము, చేతులు శుభ్రంగా కడుక్కోకపోవడం లాంటి కారణాల వలన అతిసారం సోకుతుందని అన్నారు. వాంతులు, విరేచనాల సమయంలో ఏ జాగ్రతలు తీసుకోవాలనేది క్షేత్ర స్థాయి సిబ్బంది వివరిస్తారని తెలిపారు. విరేచనాల సమయంలోనూ ,తరువాత తల్లిపాలు,ఇతర నోటి ద్రావణాలు, అనుబంధ ఆహారం ఇవ్వాలని తెలిపారు. బిడ్డకు ఆహారం తినిపించే ముందు, వంట చేయడానికి ముందుగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. విరేచనాలై తే ఓఆర్‌ఎస్ ద్రావణంతో పాటు నిర్దేశించిన మోతాదులో జింక్ మాత్రలు 14 రోజులు వాడాలన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు అవసరమైన మందులు అందుబాటులో ఉంచమని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆశా, ఆరోగ్య కార్యకర్తల వద్ద ఇవి అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నాగరాజు, క్షేత్రస్తాయి పర్యవేక్షకులు ప్రభాకర్ రెడ్డి, ఎస్తేర్‌రాణి, యశోద, ఆరోగ్య కార్యకర్త కష్ణవేనమ్మ , ప్రాజెక్షనీస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

చెత్తతో సంపద సృష్టించాలి

ప్రజాశక్తి-పత్తికొండ

గ్రామాలలో చెత్త సేకరణ ద్వారా తడి, పొడి వ్యర్థాలు నుంచి ఎరువు తయారు చేసి సంపద సృష్టించుకోవాలని పత్తికొండ ఎంపిడిఒ కవిత పేర్కొన్నారు. శుక్రవారం పత్తికొండ మండల పరిధిలోని దూదేకొండ గ్రామంలో పంచాయతీ సెక్రెటరీ సాలె బోకారి ఆధ్వర్యంలో ఎంపిడిఒ కవిత చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించారు. ఆమె మాట్లాడుతూ చెత్త సంపద ద్వారా వచ్చే ఆదాయం గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందన్నారు. పారిశుధ్య కార్మికులు వీధిలో వచ్చినప్పుడు ట్రై సైకిల్‌లోకి తడి, పొడి చెత్త వెయ్యాలని అన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామపంచాయతీ సిబ్బంది, ఆశ వర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

రైతును నట్టేట ముంచిన పొగాకు కంపెనీలు

-కంపెనీలపైచర్యలుశూన్యం -అప్పులఊబిలో అన్నదాతలు

ప్రజాశక్తి-క్రిష్ణగిరి

మీరు పంటను వేయండి మేము కొనేస్తామంటూ తీయటి మాటలతో రైతులను మభ్యపెట్టారు కంపెనీ యజమానులు. కోటి ఆశలతో రైతులు పొగాకు సాగు చేశారు. తీరా పంట అమ్మేందుకు వెళితే అడ్డగోలు నిబంధనలతో కంపెనీలు అన్నదాతలను ముప్పు తిప్పలు పెడుతున్నాయి. గత ఏడాది పొగాకు లాభాలు కురిపించాయి. దీంతో పోరాకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. గత సంవత్సరం వివిఎస్‌టి, ఐటిసి, జిపిఐ తదితర కంపెనీలు వారి ఏజెంట్లు పొగాకు సాగు చేయాలని గిట్టుబాటు ధర ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో గత ఏడాదితో పోలిస్తే మూడు రెట్లు పొగాను ఎక్కువగా సాగు చేశారు. కంపెనీలు రైతుల వద్దకే వచ్చి కొంటామని గత ఏడాది క్వింటాలుకు రూ.15000 నుంచి రూ.16500 వరకు కొనుగోలు చేశారు. ఈ ఏడాది కూడా సాగు చేస్తే రైతుల వద్దకే వచ్చి కొంటామని కంపెనీలు తెలియజేస్తాయి. అయితే ప్రస్తుతం పొగాకు రైతుల ఇళ్లల్లో పొగాకు బెళ్ళు గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి పంటను కాపాడు కునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. అటు పొగాకును ఇంట్లో దాచుకోలేక, మార్కెట్లో విక్రయించుకోలేక నరక వేదన అనుభవిస్తున్నారు. రైతుకు విత్తనాలు ఇచ్చి, నాటే పద్ధతులు పెంచే విధానం పొగాకు ఆరబెట్టె విధానం తెలియజేశారు. చివరికి పంట చేతికి రాగానే ఆకు బాలేదు అంటూ సాకులు పెడుతున్నారు. పొగాకు పంట చేతికి వచ్చిన తర్వాత రూ.18,000 ఇస్తామని చెప్పిన వారు ఇప్పుడు కనీసం రూ.పదివేలు కూడా అడగడం లేదు. పొగాకు సాగుకు ఎగరాకు రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతుంది. కొందరు కంపెనీ ప్రతినిధులు క్రిష్ణగిరి, తుగ్గలి, మద్దికేరా తదితర మండల పరిధిలో పలువురు రైతుల దగ్గరికి వెళ్లి పొగాకు సాగు చేస్తే ఎకరాకు రూ 4,500 ప్రకారం నారు విత్తనాలు ఇస్తామని పంట చేతికి వచ్చిన తర్వాత దిగుబడి ఎలా ఉన్నా పొగాకు రూ.18000 చొప్పున కొనుగోలు చేస్తామని నమ్మ పలికారు.

నాణ్యత పేరుతో దగా: పొ గా కు పంట క్వింటాలుకు రూ.18 వేలు ఇస్తామని చెప్పిన వారు ఇప్పుడు కనీసం రూ.5000లకు కూడా అడగడం లేదు. సాధారణంగా పొగాకును అమ్మే ఒదుకు రైతులకు కేంద్రాలకు మాత్రమే తరలించాలి. కూరగాయల మాదిరిగా వివిధ ప్రాంతాలకు తరలించాల్సిన అవశ్యకత ఉండదు. రైతుల బేళ్లను కంపెనీకి తీసుకెళ్లిన తర్వాత కేవలం ఒకటి రెండు బేళ్లను మాత్రమే కొనుగోలు చేసి మిగతా బేళ్లనును నాణ్యత లేదని సాకుతో వెనక్కి పంపుతున్నారు. దీనివలన రైతులు అత్యంత దారుణంగా మోసపోతున్నారు. కొందరు వ్యాపారులు నామాత్రపు ధరను చెల్లించి రైతులను దగా చేశారు. క్వింటాలు రూ.5 నుంచి 6 వేల మించి పలకడం లేదని రైతులు వాపోతున్నారు. నాణ్యత పేరుతో వెనక్కి తిరిగి పంపుతున్నారు. దీంతో రైతులకు రాను, పోను రవాణాచార్జీల భారం అదనంగా చేరింది.

నిలువలు ఎక్కువున్నాయి కోనలేమంటున్నారు

పి.జగదీష్ : రామకష్ణాపురం

సిరి పొగాకు నారు ఒంగోలు నుంచి కొన్నాను. 10 ఎకరాలలో సాగు చేశాను. రూ.ఆరు లక్షల వరకు పెట్టుబడి అయ్యింది. 110 బేళ్ళ పంట దిగుబడి వచ్చింది. నా మీద నమ్మకంతో మరి కొంత మంది రైతులు 40 ఎకరాలు సాగు చేశారు. అగ్రిమెంట్ ఉన్నప్పటికీ నాణ్యత లేదంటూ కాలయాపన చేస్తున్నారు.పంట ఉత్పత్తులను గుంటూరుకు తీసుకురావాలని చెబుతున్నారు. అగ్రిమెంట్ చేసుకున్నప్పుడు మాత్రం ఇక్కడే పంట ఉత్పత్తులను కొంటామని చెప్పారు.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

వై.పరమేష్ రెడ్డి ,ఎర్రగుడి : క్రిష్ణగిరి రైతు సంఘం నాయకులు

పొగాకు కంపెనీల యాజమాన్యం దళారులు రైతులను మోసం చేసి పొగాకు కొనకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అధికారులు స్పందించి కంపెనీలపై చర్యలు తీసుకోవాలి. గిచ్చుబాటు ధర కల్పించాలి.

అందరి నుంచి కొనమన్నారు: క్రిష్ణగిరి ఎఒ: వెంకటేశ్వర్లు

జిల్లా అధికారుల నుంచి వచ్చినటువంటి సూచనల మేరకు పొగాకు అమ్ము కోకుండా మిగిలిపోయిన రైతుల జాబితాను తయారుచేసి పై అధికారులకు పంపించాం. ఎక్కువ మందికి అగ్రిమెంట్ లేనందున ఐటిసి కంపెనీ వారు తీసుకోలేదని రైతులు తెలిపారు. కొంతమందికి ఉన్నప్పటికీ గ్రేడ్ సరిగ్గా లేదని తీసుకొనలేదు. ప్రభుత్వ సూచన మేరకు అందరి రైతుల దగ్గర కనుగొను చేయుటకు జిల్లా అధికారులు సూచనలు ఇచ్చారు.

రోడ్డుపై పారుతున్న మురుగునీటిని చూపుతున్న పిపిఎస్‌ఎస్ నాయకులు

రోడ్లపై పొంగిపొర్లుతున్న మురుగు నీరు

- అన్ని శుభ్రం చేయించామని ప్రకటించిన మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

15 కాలనీలకు వెళ్లే 60 అడుగుల ప్రధాన రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తూ ట్రాఫిక్ అంతరాయం కలిగే పరిస్థితి ఏర్పడి గంటలు గడుస్తున్నా ప్రజారోగ్య శాఖ అధికారులు సానిటరీ ఇనిస్పెక్టర్లు ఏం చేస్తున్నారని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఎ. ఆంజనేయులు గౌడ్, మహమ్మద్ యూనుస్, ఇరిగినేని పుల్లారెడ్డి ప్రశ్నించారు. ఇళ్ళ ముందు మురుగు నీరు ప్రవహిస్తున్నందున బయటికి వెళ్లే పరిస్థితి లేదని అశోక నగర్, శ్రీ నగర్ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు శుక్రవారం ఉదయం పిపి ఎస్‌ఎస్ ప్రతినిధి బృందం ఆ ప్రాంతంలో పర్యటించింది. వారు మాట్లాడుతూ నగరపాలక సంస్థ అధికారులకు పన్నులు పెంచడం పై ఉన్న శ్రద్ధ ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడం పై లేదని విమర్శించారు. నగరంలో ఒకటి రెండు ప్రాంతాలు మినహా అన్ని ప్రధాన మురుగు కాలువల్లో పేరు కొనిపోయిన మురుగును, చెత్తను తొలగించామని ప్రకటించి 24 గంటలు గడవకముందే అశోక్ నగర్ ప్రధాన మురుగు కాలువలు నిండి 60 అడుగుల రోడ్డు పై మురుగు నీరు ప్రవహించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని అన్నారు. ఈ ప్రాంతంలో ఏడాది క్రితం దాదాపు రూ.కోటి వెచ్చించి నిర్మించిన కాలువలు ఎవరికోసం నిర్మించారు?. ఆ కాలువలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రోడ్డుకు ఒకవైపు కాలువలు నిండి రోడ్డుపై ప్రవహిస్తుంటే మరోపక్క నీళ్ల లేకుండా చెత్త చెదారం పేరుకుపోయిన వట్టి కాలువ దర్శనమిస్తుందన్నారు. రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తున్నందువల్ల స్కూల్ పిల్లలు, స్థానిక ప్రజలు పక్క వీధి మీదుగా వెళ్లలేని పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రజల అసౌకర్యం కలగడానికి కారణమైన ప్రజారోగ్య అధికారి, శానిటరీ ఇనిస్పెక్టర్లపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో ఎస్‌ఆర్.గౌడ్, రఫీక్, ధనరాజు, ఇస్మాయిల్, నరసింహ పాల్గొన్నారు.

గదుల్లో పుస్తకాలు .. ఆరుబయట పాఠాలు...

-సి బెళగల్ హైస్కూలులో విచిత్రం

ప్రజాశక్తి సి బెళగల్

సిబెళగల్ లోని హైస్కూల్ లో విద్యార్థులకు సరిపడా గదులు ఉన్నాయి. అయితే విద్యా వనరుల కేంద్రంలోని సిబ్బంది అనాలోచిత వైఖరి కారణంగా ఐదు గదులలో మండలానికి పంపిణీ చేయాల్సిన పుస్తకాలు ఇక్కడే నిల్వ చేశారు. ఫలితంగా కొత్తగా చేరుతున్న ఆరవ తరగతి విద్యార్థులకు బోధన ఆరు బయట వరండాలోనే చదువుకోవాల్సి వచ్చింది. పాఠశాలలు తెరిచి సుమారు రెండు వారాలు పూర్తయినా మండలంలోని అన్నీ పాఠశాలలకు పంపిణీ చేయుటలో ఎంఇఒలు నిర్లక్షంగా ఉన్నట్లు తెలిసింది. విద్యా వనరుల కేంద్రంలో పుస్తకాలు నిల్వ చేసుకొనుటకు సరిపడా గదులు లేక అందులో స్టాకు తెచ్చిన వాహనాలు ఎంఇఒ కార్యాలయంలో నిలిపి దింపుటకు తగు ఆవరణం లేక ఈ హైస్కూల్ లో గదులను నిల్వ కేంద్రంగా ఏర్పాటు చేసుకోవడం శోచనీయం. తప్పని పరిస్థితులలో ఆరవ తరగతి విద్యార్థులు బయట గాలుల మధ్య , అధిక శబ్దాల మధ్య , అసౌకర్యాల నడుమ విద్యను అందుకుంటున్నారు.ఇక ఆ విద్యార్థులకు తరగతి గదులు సిద్ధం చేసేదెప్పుడో.. నాణ్యమైన విద్య అందెదెప్పుడో.. అంటూ తల్లిదండ్రులు, పలువురు వాపోతున్నారు.

వ్యవసాయ శాఖ అగ్రనామి ఎడిఎగా రాజశేఖర్

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్



కర్నూలు వ్యవసాయ శాఖ అగ్రనామి ఎడిఎగా రాజశేఖర్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన నంద్యాల వ్యవసాయ శాఖ నుండి కర్నూలు కు బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. వ్యవసాయ శాఖ కార్యక్రమాలు రైతులకు అందించాల్సిన సేవలు ప్రభుత్వ కార్యక్రమాలు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ మేరకు పలువురు సిబ్బంది, ఎఒలు అభినందలు తెలిపారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయండి

- సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి హనుమంతు

ప్రజాశక్తి- ఆలూరు

ఆలూరులోని సిద్ధేశ్వర కాలనీలో కొట్టాలు వేసుకుని 15 ఏళ్ల నుంచి నివాసముంటున్నారని, కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్ధేశ్వర కాలనీలో నివాసం ఉంటున్న కాలనీ వాసులతో కలిసి విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం మండల విద్యుత్ ఎఇ గుర్రప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత 15 ఏళ్ల నుంచి సిద్ధేశ్వర కాలనీలో నిరుపేదలు కొట్టాలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని, అటువంటి ప్రజలకు కాలనీలో మౌలిక వసతులు విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. విద్యుత్ స్తంభాల కోసం కాలనీవాసులు అనేకసార్లు విద్యుత్ కార్యాలయం ముందు ఆందోళన చేసినా పట్టించుకునే పరిస్థితిలో అధికారులు లేరని మండిపడ్డారు. విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో వీధి దీపాలు లేక కాలనీవాసులు చీకటిలో మగ్గుతున్నారని తెలిపారు. విద్యుత్ అధికారులు స్పందించి సిద్ధేశ్వర కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో కాలనీవాసులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు విఠల్, సిద్ధేశ్వర కాలనీ వాసులు రాధ, డానియల్, ఉరుకుంద, మహానంది, రాముడు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌కెల ద్వారా యూరియా పంపిణీ

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - దేవనకొండ

యూరియా తీసుకుంటున్న రైతులు

ఆర్ఎస్‌కెల ద్వారా అధికారులు యూరియా పంపిణీ చేపట్టారు. మండలంలో 'ఆర్ఎస్‌కెలకు అందని ఎరువులు' అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో బుధవారం వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. అందుకు స్పందించిన ఎఒ ఉషారాణి యూరియా, డిఎపి ఎరువులకు జిల్లా వ్యవసాయ అధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు శుక్రవారం దేవనకొండ ఆర్ఎస్‌కెకు యూరియా బస్తాల లారీ లోడ్ వచ్చింది. రైతులు ఒక్కసారిగా ఆర్ఎస్‌కె వద్దకు చేరుకుని యూరియా బస్తాలను తీసుకున్నారు. సాయంత్రంలోపు యూరియా బస్తాల లోడ్ అయిపోయిందని, మరిన్ని యూరియా బస్తాల లోడ్‌లు వస్తాయని విఎఎ మల్లికార్జున తెలిపారు.

అధికారులకు బదిలీలు సహజమే

- వ్యవసాయ శాఖ అధికారి బాలవర్ధిరాజు

అశోక్ కుమార్ రెడ్డిని సన్మానిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ప్రతి అధికారికీ బదిలీ సహజమేనని ఆదోని డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి బాలవర్ధిరాజు తెలిపారు. ఆదోని ఎఒ అశోక్ కుమార్ రెడ్డి సేవలందించి బదిలీపై నందికొట్కూరుకు వెళ్లారు. ఆ స్థానంలో ఎఒగా సుధాకర్ ఇటీవల కాలంలో బాధ్యతలు చేపట్టారు. ల్యాబ్ ఎఒగా సుజాత బాధ్యతలు చేపట్టగా, రెగ్యులర్ ఎఒగా బాలవర్ధిరాజు నియమితులయ్యారు. శుక్రవారం అశోక్‌కుమార్‌రెడ్డిని ఆత్మ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన వారు బదిలీపై వెళ్లడం బాధాకరమన్నారు. వారు ఎక్కడ పని చేసినా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. అశోక్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... తనకు అన్ని విధాలుగా సహకరించిన గ్రామస్తులకు, అధికారులకు, సచివాలయ ఉద్యోగులకు రుణపడి ఉంటానని తెలిపారు.

డ్రిప్ విధి విధానాలపై సమీక్ష

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

డ్రిప్ విధి విధానాలపై రైతులతో జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.ఫిరోజ్ ఖాన్ సమీక్ష నిర్వహించారు. శుక్రవారం మండలంలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో ఆదోని క్లస్టర్ ఏరియా సమావేశం నిర్వహించారు. జిల్లాకు 2025 నుంచి 2026 సంవత్సరానికి గాను అడిషనల్ 7 వేల హెక్టార్లలో టార్గెట్ ఇచ్చినట్లు తెలిపారు. ఎంఐ ఇంజినీర్ హంపన్న, హెచ్ఒ శ్రీవాణి, అపర్ణ, రఘు, ఎంఐఎఒలు బాష, నాగరాజు, సౌమ్య పాల్గొన్నారు.

ఇంటి పట్టా మంజూరుకు అనుకువైన ప్రాంతాలను గుర్తించండి

- జెసి డాక్టర్ నవ్య

ప్రజాశక్తి - ఆదోని

అర్హులైన ప్రతి కుటుంబానికీ ఇంటి స్థలం మంజూరు చేసేందుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని జెసి డాక్టర్ బి.నవ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదోని డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, అధికారులతో జెసి నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇప్పటివరకు ఇంటి పట్టా కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎంతమంది అర్హులు ఉన్నారని ఆరా తీశారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల స్థలాన్ని ఇంటి పట్టా రూపంలో మంజూరు చేయాలని ఆదేశించారు. అధికారులు న్యాయంగా, పారదర్శకంగా, అర్హత ప్రమాణాలు పరిశీలించి, అర్హులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కౌలు రైతు కార్డులపై సమీక్ష నిర్వహించారు. గతేడాది ఆదోని డివిజన్‌లో 10,500 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నప్పటికీ, ప్రస్తుతం కేవలం 1,100 కార్డులే నమోదయ్యాయని చెప్పారు. జులై 15లోపు రెన్యువల్, కొత్త దరఖాస్తులు పూర్తి చేయాలని, ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ అధికారి బాలవర్ధిరాజును ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణ, గంగిరెడ్డి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్స్ వేణు సూర్య, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

సమీక్షలో మాట్లాడుతున్న జెసి డాక్టర్ నవ్య

10న ఎల్ఎల్‌సికి నీటి విడుదల

- తుంగభద్రకు 50 వేల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో - 60 టిఎంసిలకు చేరిన నీటి నిల్వ

ప్రజాశక్తి - హోళగుంద

జులై 10న దిగువ కాలువకు సాగు, తాగునీటిని విడుదల చేసేందుకు బోర్డు కమిటీ సమావేశంలో నిర్ణయించారు. శుక్రవారం జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జులై 10 నుంచి 31 వరకు రోజుకు 500 క్యూసెక్కుల ప్రకారం, ఆగస్టు 1 నుంచి నవంబర్ 31 వరకు 650 క్యూసెక్కుల ప్రకారం నీటి లభ్యతను బట్టి విడుదల చేస్తారు. తుంగభద్ర దిగువ కాలువ కింద ప్రతేడాది వేల ఎకరాల్లో సాగు జరుగుతుంది. రైతులు ఇప్పటికే వరి నారుమళ్లు వేసుకొని వర్షం కోసం, కాలువ నీటి విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. జూన్ 30న, జులై 1న విడుదల చేస్తారన్న నమ్మకం రైతుల ఉండేది. 30 టిఎంసిలకు పై పడితే వెంటనే విడుదలకు సన్నద్ధం చేయాల్సి ఉండగా ఎల్ఎల్‌సి ఆర్‌సిసి లైనింగ్ పనులు జరుగుతుండటం వల్ల రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి తెచ్చి జులై 15 పైన విడుదల చేయించేలా గుత్తేదారులు ప్రయత్నాలు మమ్మురంగా చేసినట్లు సమాచారం.

జలచౌర్యాన్ని అరికట్టాలి

దిగువ కాలువకు ఆర్‌సిసి లైనింగ్ పనులు చేసినప్పటికీ కర్ణాటకలో జరుగు జలచౌర్యాన్ని అరికట్టకపోతే ఆంధ్ర ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తూతూమంత్రంగా గస్తీ నిర్వహించి కాలువపై దాడులు నిర్వహించడం వల్ల ఎలాంటి ఉపయోగమూ ఉండదని పలువురు పేర్కొంటున్నారు. న్యాయంగా, సమృద్ధిగా నీరు అందించేందుకు అధికారులు కృషి చేయాలని రైతులు కోరారు.

అండర్ గ్రౌండ్ పైపులైన్లు తొలగించాలి

కర్ణాటకలో కొందరు ఎల్ఎల్‌సి నుంచి అండర్ గ్రౌండ్ పైపులైన్లు ఏర్పాటు చేసుకొని వందల ఎకరాలకు నీటిని మళ్లించుకుంటున్నారు. తీరా ఆంధ్ర సరిహద్దులోకి వచ్చేసరికి గుమకం పడతాయి. బోర్డు అధికారులు అండర్ గ్రౌండ్ పైపు లైన్లను గుర్తించి తొలగించేందుకు చొరవ చూపాలని రైతులు పేర్కొంటున్నారు.

9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కార్మిక వ్యతిరేక లేబర్ చట్టాల రద్దు కోసం జులై 9న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్పొరేట్లకు ఊడిగం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగిస్తోందని, కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాల అమలు కోసం దేశవ్యాప్తంగా జులై 9న సమ్మె చేయబోతున్నారని తెలిపారు. ప్రతి కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సిఐటియు నాయకులు బి.గోవర్ధనమ్మ, ఎస్.నాగలక్ష్మి, కె.శైలజ, ఎం.ప్రవీణ్, కె.ఇస్మాయిల్, పి.రాజు, బి.తిమ్మప్ప, విజయమ్మ, దేవకుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గోవిందు

డాక్టర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

బదిలీ డాక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి - కోసిగి

స్థానిక ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్‌గా ఆరేళ్లు విధులు నిర్వహించి సాధారణ బదిలీల్లో భాగంగా ఈ.తాండ్రపాడుకు బదిలీ అయిన డాక్టర్ మనోజ్ కుమార్‌ను శుక్రవారం సిబ్బంది ఘనంగా సన్మానించారు. ప్రభుత్వాస్పత్రిలో కాన్పులు, ఆరోగ్యశ్రీ సేవలు, ఇతర చిన్న, చిన్న రోగాల నివారణ కోసం వచ్చే రోగులతో మమేకమై మంచి వైద్యంతో, ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల సేవలను వినియోగిస్తూ ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. ప్రతి ఉద్యోగికీ బదిలీలు సర్వసాధారణమని తెలిపారు. కోసిగిలో సేవలు అందించడంపై ప్రత్యేకంగా గ్రామస్తులు ఆయనను అభినందించారు. బదిలీపై వెళ్లిన డాక్టర్‌ను సిబ్బంది, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చిరు సత్కారం చేశారు.

7న ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- మహజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకులు ఆంధ్రయ్య

ప్రజాశక్తి - గోనెగండ్ల

జులై 7న ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గ్రామగ్రామాన నిర్వహించి మాదిగల ఐక్యతను చాటాలని మహజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకులు సుమాల ఆంధ్రయ్య మాదిగ, ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గంజిహళ్లి మహదేవ మాదిగ కోరారు. శుక్రవారం మండలంలోని హెచ్.కైరవాడి గ్రామంలో ఎంఆర్‌పిఎస్ గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం ఎంఆర్‌పిఎస్ జెండా దిమ్మె ఏర్పాటు కోసం భూమి పూజ చేశారు. వెముగోడు భాస్కర్ మాదిగ, కైరవాడి రాజు మాదిగ, రాముడు, కరుణాకర్, శివ, బజారి పాల్గొన్నారు.

తహశీల్దార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కోసిగి

కోసిగి తహశీల్దార్‌గా ఎ.వేణుగోపాల్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బదిలీల్లో భాగంగా కర్నూలు కలెక్టరేట్ నుంచి కోసిగి రెగ్యులర్ తహశీల్దార్‌గా బదిలీపై వచ్చినట్లు ఆయన తెలిపారు. గతంలో ఇక్కడ కేవలం డిప్యూటీ తహశీల్దార్లతో విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం రెగ్యులర్ తహశీల్దార్ వచ్చారు. ఆయన మాట్లాడుతూ... మండలంలో ఏవైనా రెవెన్యూ సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మాట్లాడుతున్న రాముడు

ఎన్‌టిఆర్ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం పట్టణ నాయకులు రాముడు, కె.కృష్ణ కోరారు. శుక్రవారం వారు మాట్లాడారు. పట్టణంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేస్తున్నందున ప్రజలకు తాగునీటి సమస్య ఏర్పడిందని తెలిపారు. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోలేదని చెప్పారు. పరిమిత స్థాయిలో ట్యాంకర్లు పెట్టినందువల్ల ప్రజలకు తాగునీటి సమస్య ఉందని తెలిపారు. ప్రజలకు యుద్ధప్రాతిపదికన ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యకర్తలు లక్ష్మన్న, మోహిన్, ఉస్మాన్ వలీ, శంకర్ పాల్గొన్నారు.

ప్రాథమిక దశలోనే గుర్తించాలి

- మెడికల్ హెల్త్ ఆఫీసర్ షెహనాజ్ బేగం

ప్రజాశక్తి - ఆదోని

చాప కింద నీరులా విస్తరిస్తున్న టిబి వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని హవన్నపేట మెడికల్ హెల్త్ ఆఫీసర్ షెహనాజ్ బేగం తెలిపారు. ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని హవన్న పేట యుపిహెచ్‌సిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రెండు వారాలపాటు దగ్గు, జ్వరం, గళ్ల పడడం, ఆయాసం వంటి లక్షణాలు కనిపిస్తే ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలని తెలిపారు. అక్కడ గళ్ల పరీక్షలు, ఎక్స్‌రేలు తీయించుకోవాలన్నారు. క్షయగా నిర్ధారణ అయితే ప్రభుత్వమే ఉచితంగా ఆరు నెలల పాటు మందులు పంపిణీ చేస్తుందని తెలిపారు. పట్టణంలో ప్రత్యేకంగా వంద రోజులపాటు క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. కౌన్సిలర్ మహ్మద్ గౌస్, సూపర్‌వైజర్లు బాబురాజు, జ్ఞానేశ్వరి, సుబ్బమ్మ బాయి, ఎఎన్ఎం పద్మ, ఆశావర్కర్లు సరోజ, సరళ, ఇందిరా, రేఖ ఉన్నారు.

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

వేలం వ్యవహారంలో ఎమ్మెల్యే మౌనం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపల్ షాపుల అద్దె వేలం వ్యవహారంలో ఎమ్మెల్యే పార్థసారథి మౌనం వహించడం వైసిపి కౌన్సిలర్లకు పరోక్షంగా సహకరించడమేనని పలువురు విమర్శిస్తున్నారు. బహిరంగంగా దుకాణాలకు వేలం జరిగి ఉంటే మరింత ఆదాయం పెరిగేదని చెబుతున్నారు. అందరూ కుమ్మక్కయి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టిన మాట వాస్తవమా? కాదా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గురువారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో 37 దుకాణాలకు అద్దె కోసం వేలం నిర్వహించారు. పార్థసారథి ఎమ్మెల్యే అయ్యాక ఆదోనిలో అవినీతి కుంభకోణాలు చోటు చేసుకుంటున్నాయి. తాము ఒక అవినీతిపై పోరాడుతుండగా మరో అవినీతి ముందుకొస్తోందని, ఏ అవినీతిపై పోరాడాలో తేల్చుకోలేకపోతున్నామని ప్రజాసంఘాల నాయకులు మండిపడుతున్నారు. రూ.కోట్లు అడ్వాన్స్, బాడుగుల రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయాన్నిచ్చే ఆదోని మెయిన్ రోడ్ 37 మున్సిపల్ షాపుల వేలం గురించి పత్రికల్లో ప్రకటన ఇచ్చినా బహిర్గతం చేయకుండా నొక్కి పెట్టారని విమర్శలున్నాయి. ఏమాత్రం ప్రచారం చేయకుండా రహస్యంగా వేలం నిర్వహించడంలో అర్థమేమిటి.. దీని వెనుక ఎంత డబ్బు చేతులు మారిందో..? ఇందులో అధికారులు, నాయకుల పాత్ర, ఇందులో దోషులు ఎవరు.. అని విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి నిజాయితీపరులైతే కచ్చితంగా ఈ వేలం వ్యవహారంపై విచారణ జరిపి, ఈ షాపుల వేలాన్ని రద్దు చేయాలని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఆయన కూడా వైసిపితో చేతులు కలిపినట్టు భావించాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. ఎమ్మెల్యే పార్థసారథి వైసిపితో కలిసి నయా 60:40 ఏర్పాటు చేసినట్లు ప్రజలు భావించాల్సి ఉంటుందని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదోనిలో మున్సిపల్ షాపుల అక్రమ వేలాన్ని రద్దు చేసి ప్రభుత్వ ఆదాయం పెంచేలా మరోసారి వేలం నిర్వహించాలని కోరారు.

వేలం నిర్వహిస్తున్న సిబ్బంది

కలిసికట్టుగా ముందుకు...

- టిడిపి అబ్జర్వర్, రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమ పాలన సాగుతుందని, ప్రతి ఒక్కరూ లబ్ధి పొందేలా సమిష్టిగా కృషి చేద్దామని టిడిపి నియోజకవర్గ అబ్జర్వర్, రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని జెబి గార్డెన్స్‌లో మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గంలోని ప్రతి బూత్ నుంచి కుటుంబ సాధికారులు, గ్రామ/పట్టణ కమిటీలు, పట్టణ అధ్యక్షులను ఎన్నుకొనేందుకు ప్రతి ఒక్కరూ పనిచేయాలని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు మాట్లాడుతూ... పార్టీ కోసం 43 ఏళ్లుగా పార్టీ కోసం పని చేస్తూ పార్టీ అభివృద్ధికి పనిచేశానని తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడిన ప్రతి నాయకునికీ, కార్యకర్తకూ న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత ఇన్‌ఛార్జీగా తనపై ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలందరూ కలిసి ఒకే తాటిపై నడిచేందుకు అందరూ సహకరించాలని కోరారు. పార్టీ ఎవరికి ఏ బాధ్యత ఇచ్చినా క్రమశిక్షణతో పార్టీ లైన్ దాటకుండా అటు ప్రభుత్వానికి, ఇటు పార్టీకి, ప్రజలకు సేవలందించే విధంగా ముందుకు సాగుతానని తెలిపారు. సాగాలని రాబోయే ఎన్నికల్లో అన్ని గ్రామ/పట్టణ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలిపించుకోవాలని కోరారు.

సమావేశంలో గందరగోళం : టిడిపి సీనియర్ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ... పార్టీ సభ్యత్వం తాము చేయిస్తే గుర్తింపు కార్డులు ఎలా పంచుతారని సమావేశంలో లేవనెత్తారు. ఈ నేపథ్యంలో ఇరు గ్రూపుల మధ్య వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. ఇంతలో అబ్జర్వర్ జోక్యం చేసుకొని సర్ది చెప్పారు. మరో మారు సమావేశమై అన్ని వర్గాలకూ న్యాయం జరిగేలా చూస్తామని అబ్జర్వర్ హామీ ఇచ్చారు. సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, ఫక్రుద్దీన్, పెద్దహరివాణం బసవ, జెబి.రంగన్న, సోము, వేణు గోపాల్ రెడ్డి, వెంకటేష్ చౌదరి, మదిరే వీరేష్, బుద్ధారెడ్డి ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

టిడిపి బలోపేతానికి సంస్థాగత కమిటీలు

- నియోజకవర్గ పరిశీలకులు నెట్టెం వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - మంత్రాలయం

గ్రామీణ స్థాయి నుంచి టిడిపి బలోపేతానికి సంస్థాగత కమిటీల నిర్మాణం చేపట్టినట్లు ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకులు, బిసిఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రివరిన్ ఫంక్షన్ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేసేందుకు కమిటీలు ఏర్పాటు చేసి బాధ్యతలను అప్పగించనున్నట్లు తెలిపారు. విభేదాలు వీడి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

చుట్టాల మాట విని పార్టీని తాకట్టు పెట్టొద్దు

- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి

చుట్టాలు కదా అని వారి మాట విని పార్టీని తాకట్టు పెట్టొద్దని, పార్టీ బలోపేతానికి కృషి చేసి.. పార్టీ జెండా మోసిన ప్రతి వ్యక్తినీ తన భుజాన పెట్టుకుంటానని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ... గత ఎన్నికల్లో చుట్టాలు చెప్పారని వైసిపి అభ్యర్థికి ఓట్లు వేయడం వల్లే టిడిపి ఓటమి చవి చూసిందని తెలిపారు. చుట్టాలయితే ఇంటికి వారు రావచ్చని, వారి ఇంటికి మనం వెళ్లొచ్చని చెప్పారు. పార్టీకి మాత్రం మోసం చేయవద్దని హితవు పలికారు. టిడిపి ఇన్‌ఛార్జీగా అందరినీ కలుపుకుని వెళ్తానని, కలిసి వస్తే శత్రువునైనా చేరదీసి పార్టీ బలోపేతానికి, విజయానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి నుంచి గెలుపు సాధించే విధంగా కమిటీలు ఉండాలని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిశీలకులుగా డిసిఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశ్వర్లు, రామలింగారెడ్డి, రామాంజనేయులు, మనోహర్ చౌదరి, అప్సర్ బాష, పర్ల శ్రీనివాసులు, ఉస్సమ్మగారి ప్రసాద్‌ను నియమించి ఇక్కడికి పంపించదని చెప్పారు. విభేదాలు వీడి గ్రామాల్లో కమిటీ సభ్యుల పేర్లతో కచ్చితమైన జాబితా తయారు చేసి ఇవ్వాలని తెలిపారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు, సీనియర్ నాయకులు ముత్తురెడ్డి, రామిరెడ్డి, గోపాల్ రెడ్డి, బసలదొడ్డి ఈరన్న, మాజీ జడ్‌పిటిసి లక్ష్మయ్య, ఏసేపు, సతీష్ నాయుడు, మల్లికార్జున, చావిడి వెంకటేష్, వెంకటపతి రాజు, పెద్ద లక్ష్మయ్య, అశోక్ రెడ్డి, ఎంపిటిసి వెంకటేష్, కంసాలి నరసింహ, పవన్ కుమార్, ఆర్‌కె.రఘు, శివ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

అధిక ధరలకు అమ్మితే చర్యలు

- ఎఒ ఉషారాణి

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణ డీలర్లు విత్తనాలు, పురుగు మందులు, ఎరువు మందులను మద్దతు ధరకే అమ్మాలని, అధిక అమ్మితే చర్యలు తీసుకుంటామని ఎఒ ఉషారాణి హెచ్చరించారు. శుక్రవారం ఆమె దేవనకొండ క్రాస్ రోడ్డులోని ఫార్మర్ ప్రొడ్యూసర్ లిమిటెడ్ ఎరువు మందుల దుకాణాన్ని తనిఖీ చేశారు. అనుమతి లేని కాంప్లెక్స్ ఎరువులను విక్రయించినందుకు రూ.5,62,820 ఎరువుల స్టాక్ సేల్స్‌ను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. యూరియాకు ఎలాంటి మందులూ లింక్ చేసి అమ్మకూడదని, అలా అమ్మిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు విక్రయించే మందులకు బిల్లు ఇవ్వాలన్నారు. బిల్లు ఇవ్వకుంటే ఫిర్యాదు చేయాలని రైతులకు తెలిపారు. అనుమతుల్లేని బయో మందులను అమ్మకూడదని డీలర్లకు సూచించారు. ఎఇఒ రంగన్న, అబ్దుల్ సలాం, రైతులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న ఉషారాణి

రేషన్ పంపిణీని త్వరగా పూర్తి చేయాలి : తహశీల్దార్

ప్రజాశక్తి - చిప్పగిరి

వృద్ధులు, వికలాంగులకు సకాలంలో రేషన్ పంపిణీని పూర్తి చేయాలని తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ డీలర్లను ఆదేశించారు. శుక్రవారం చిప్పగిరిలో ఉన్న రేషన్ షాపులను తనిఖీ చేసి ప్రభుత్వ ఆదేశాల మేరకు వృద్ధులు, వికలాంగులకు కేటాయించిన రేషన్ బియ్యాన్ని సర్పంచి దాసరి గోవిందరాజులు, తహశీల్దార్ చేతులమీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడారు. మండలంలో వృద్ధులు, వికలాంగులు మొత్తం 685 మంది లబ్ధిదారులున్నారని తెలిపారు. వీరందరికీ 30వ తేదీలోపు రేషన్ పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు. ఇప్పటి వరకు 50 శాతం పూర్తయిందన్నారు. డీలర్ రామయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.


రేషన్ పంపిణీ చేస్తున్న తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్

నట్టల నివారణకు మందు

- పశు వైద్యాధికారి వెంకటేష్, టిడిపి నాయకులు మల్లికార్జున

ప్రజాశక్తి- దేవనకొండ

పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన సామూహిక గొర్రెలు, మేకల్లో నట్టల నివారణ మందును గొర్రెల పెంపకందారులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని దేవనకొండ పశువైద్యాధికారి వెంకటేష్, టిడిపి మండల నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున తెలిపారు. శుక్రవారం మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో ఉచిత నట్టల నివారణ మందు పంపిణీని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 26 నుంచి జులై 10 వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న గడ్డి విత్తనాలు, సబ్సిడీలో దాణా, పశువులకు బీమా పథకాన్ని గొర్రెలు, మేకల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశు వైద్య సిబ్బంది ఎల్ఎస్ఎఇ భాస్కర్, టిడిపి నాయకులు పెద్ద కౌలుట్లయ్య, గొర్ల సుంకన్న, చెన్నప్ప, రవికుమార్, గిడ్డయ్య, చిన్న సుంకన్న, గొర్రెల యజమానులు ఎల్ల స్వామి, మాధవ స్వామి పాల్గొన్నారు.

గొర్రెలకు మందు వేస్తున్న మల్లికార్జున

రైతులను ముంచుతున్న 'సోలార్'

- సాగు భూములను తక్కువకు తీసుకుంటున్న వైనం

- నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు

- చర్యలు తీసుకోవాలి - సర్పంచి గోవిందరాజులు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరిలో రైతులను సోలార్ కంపెనీలు మోసం చేస్తున్నాయని, రైతుల సాగుకు వచ్చే భూములను అతి తక్కువ ధరకు తీసుకుంటూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయని సర్పంచి దాసరి గోవిందరాజులు విమర్శించారు. శుక్రవారం చిప్పగిరి సచివాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాగుకు పనికిరాని భూములను పరిశీలించి సోలార్ కంపెనీలు తీసుకోవాల్సి ఉండగా, అడంగల్, వన్ బి, వంశవృక్షం అదేమీ లేకుండా సాగుకు పనికొచ్చే మంచి పొలాలను సర్వే చేయకుండా తక్కువ ధరకు తీసుకుంటూ రైతులను నట్టేట ముంచుతున్నారని మండిపడ్డారు. దళారులు రైతులతో పొలాలను తక్కువ ధరలకు అమ్మిస్తూ మోసం చేస్తున్నారన్నారు. సోలార్ కంపెనీల నుంచి వచ్చే కమీషన్ కోసం కక్కుర్తి పడుతున్నారని తెలిపారు. పొలం సాగుకు వస్తుందా, లేదా అని పరిశీలించాల్సిన రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రతి ఒక్కరూ మామూళ్ల మత్తులో ఉన్నారని, కలెక్టర్ సంబంధిత అధికారులపై చర్యలు తీసుకొని సోలార్ కంపెనీ మోసాలను అరికట్టి రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే చిప్పగిరి అంబేద్కర్ సర్కిల్‌లో రైతులతో కలిసి నిరసన, ధర్నా చేపడతామని హెచ్చరించారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి : ఎపిడబ్ల్యుజెఎఫ్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బసవరాజు, చంద్రమోహన్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే పార్థసారథికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జర్నలిస్టుల ఇంటి స్థలాల సమస్య చాలా ఏళ్లుగా అపరిష్కృతంగా ఉందని, ఎన్నికల సమయంలోనే జర్నలిస్టులకు ఇంటి స్థలం కేటాయిస్తామని ప్రకటించడంతో అందరూ ఎదురుచూస్తున్నారని చెప్పారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు కేటాయించేందుకు వీలుగా ప్రభుత్వం తగిన ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. జర్నలిస్టులకు కలెక్టర్ గుర్తించిన అక్రిడిటేషన్ కార్డుదారులకు గత ప్రభుత్వంలో రైల్వే పాసు ఇవ్వకుండా కాలయాపనం చేశారని, కూటమి ప్రభుత్వంలోనైనా రైల్వే పాసును ఏర్పాటు చేసేలా రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమెల్యే పార్థసారథి స్పందించి... జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీఇచ్చారు. ఫెడరేషన్ పట్టణ గౌరవాధ్యక్షులు నాగరాజ్, ఉపాధ్యక్షులు ఉరుకుందప్ప, విజయ్, నాయకులు మల్లికార్జున, యువరాజ్, మురళీకృష్ణ, ఖాన్, భీమా, రఘునాథ్ రెడ్డి, సుంకన్న, వీరేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE :: ADONI
IP 1/2020

J.Basi Reddy. ...Petitioner

- Versus -

1. M.Harinath Babu
2. Bheemalingppa
3. Kendole Raghunath
4. Boya Eranna
5. Hanumanna
6. P.Sanjeeva Reddy
7. L.Mohan Goud
8. G.Venkateswarlu
9. Veeresh
10. Balaji
11. Durga Financiers, Guntakal. ...Respondents.

PETITION FILED ON BEHALF OF THE PETITIONER UNDER SECTIONS 6, 7 AND 10 OF PROVINCIAL INSOLVENCY ACT.

1. PETITIONER:-
J.Basi Reddy, Hindu, aged about 35 years, Coolie, S/o.J.Soma sekhar Reddy, Resident of H.No.17-189, Sankar Nagar, Near Anjaneya Swamy Temple, Adoni Town, Kurnool District.

ADDRESS FOR SERVICE:-
Sri C.NAGAMALLESWARA REDDY, ADVOCATE, KURNOOL.

జనరల్ నోటీస్ టు పబ్లిక్

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా పైన తెలిపిన పిటిషనర్ అయిన జె.బసిరెడ్డి గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్, ఆదోనిలో పైన కనపరచిన రెస్పాండెంట్స్ దివాలా దావా దాఖలు చేసియున్నారు. కావున ఎవరికైనా ఇందుపైకి ఆక్షేపణలుగాని మరియు అభ్యంతరములుగాని వున్నయెడల తేది:30-06-2025 ఉదయం 10.30 గంటలకు పై కోర్టు ముందు స్వయంగా గాని వకీలు ద్వారా గాని కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపవచ్చును, ఎవ్వరూ హాజరు కాని యెడల పై కోర్టు వారు కేసును పిటిషనర్/దివాలాదారుని పరముగా తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేదీ : 30-06-2025

K Thayanna.
Advocate adoni